జర్నలిస్ట్ వార్త

శనివారం 26 సెప్టెంబర్ 2026

# సింగారంలో ఘనంగా మహా అన్నదానం

**-ఎస్సై ప్రశాంత్‌కు సర్పంచ్,కమిటీ సభ్యుల సత్కారం.**



**బయ్యారం/సెప్టెంబర్ 25.(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం మండలం సింగారం గ్రామం ఎస్టీ కాలనీలో జై సేవాలాల్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బయ్యారం ఎస్సై ప్రశాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, జై సేవాలాల్ యూత్ కమిటీ సభ్యులు ఎస్సై ప్రశాంత్ బాబును శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. యువత దైవచింతనతో పాటు ఇలాంటి సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతైనా అభినందనీయమని కొనియాడారు. గ్రామంలో ప్రజలందరూ ఇదే రకమైన ఐక్యతతో మెలిగి,శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ అన్నదాన కార్యక్రమంలో గ్రామ ప్రజలు,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు,జై సేవాలాల్ యూత్ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు విశేషంగా పాల్గొన్నారు.

## విశిష్ట సేవలకు గుర్తింపు ఉత్తమ ఉపాధ్యాయుల సత్కారం



**బయ్యారం/,సెప్టెంబర్ 25.(జర్నలిస్ట్ వార్త):**బయ్యారం మండలం ఇర్సులాపురం కాంప్లెక్స్ పరిధిలో విశిష్ట సేవలందిస్తున్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను 'ఇంటలెక్చువల్ సొసైటీ' టీం ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఘనంగా సన్మానించింది.ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు ఉపాధ్యాయుల సేవలను కొనియాడగా, తమను గుర్తించి గౌరవించినందుకు ఉపాధ్యాయులు సొసైటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఎస్ ఏటీఎఫ్ బయ్యారం మండల అధ్యక్షుడు గీతపల్లి కృష్ణ,ప్రెసిడెంట్ కల్తీ భాస్కరరావు,ప్రధాన కార్యదర్శి కొటేం వీరభద్రం, గౌరవ అధ్యక్షులు గణేష్, నర్సింహారావు తదితరులు పాల్గొని సన్మాన గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు.

## బయ్యారం చెరువుకు గోదావరి జలాలు అందించాలి

**-ప్రజాకవి జయరాజ్‌సర్పంచ్ ప్రవీణ్ మాటమంతి.**





**బయ్యారం/సెప్టెంబర్ 25.(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం పెద్ద చెరువుకు గోదావరి జలాలను మళ్లించే ఉద్యమానికి ప్రముఖ ప్రజాకవి జయరాజ్ పూర్తి మద్దతు ప్రకటించారు.హైదరాబాదులోని జయరాజ్ నివాసంలో గంధంపల్లి-కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి నీటి ఉద్యమానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఇటీవల ఎమ్మెల్యే కోరం కనకయ్య నాయకత్వంలో మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా సర్పంచ్ వివరించారు. గోదావరి జలాల ప్రాముఖ్యతపై ప్రజల్లో చైతన్యం తెచ్చేలా ఒక స్ఫూర్తిదాయక పాటను రచించాలని కోరారు.దీనిపై జయరాజ్ సానుకూలంగా స్పందిస్తూ.బయ్యారం చెరువు నిండితే రైతాంగానికి శాశ్వత నీటి భద్రత లభిస్తుందని, ఈ పోరాటంలో తాను స్వయంగా పాల్గొంటానని హామీ ఇచ్చారు.ద

## దామోదర్ కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ వేం నరేందర్ రెడ్డి



**కేసముద్రం/సెప్టెంబర్ 25 (జర్నలిస్ట్ వార్త):**కేసముద్రం మున్సిపాలిటీ 1వ వార్డుకు చెందిన గొట్టం దామోదర్ ఇటీవల మృతి చెందగా, శుక్రవారం రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి దామోదర్ చిత్రపటానికి పుష్పగుచ్ఛం సమర్పించి నివాళులర్పించారు.అనంతరం దామోదర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవ రెడ్డి, వద్దిరాజు కిషన్, దన్నసరి పీఏసీఎస్ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత-వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యులు రావుల మురళి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బండారు వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్, మాజీ సర్పంచ్ ముదిగిరి సాంబయ్యతో పాటు సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వర్ణోత్సవ సభకు తరలిరావాలి



**హనుమకొండ/ సెప్టెంబర్ 25 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం 50వ స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మధుపాక ఎల్లయ్య పిలుపునిచ్చారు. ఈ నెల 27న హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ మేనేజ్‌మెంట్ హాల్‌లో నిర్వహించనున్న సభ కరపత్రాలను శుక్రవారం అంబేద్కర్ జంక్షన్‌లో ఆవిష్కరించారు. వరంగల్ జిల్లా పరిధిలోని అన్ని మండలాల నుంచి అంబేద్కర్‌వాదులు, యువజన సంఘాల సభ్యులు, విద్యావంతులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. 1033/77 నంబర్‌తో ఏర్పాటైన సంఘం 50 ఏళ్లుగా అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బూజుగుండ్ల శ్రీనివాస్, కోశాధికారి మంత్రి చాణక్య, డాక్టర్ నవీన్, పానుగంటి దయాకర్, మాసాని గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.ద

## పీఏసీఎస్ చైర్మన్‌కు సన్మానం



**వర్ధన్నపేట/సెప్టెంబర్ 25(జర్నలిస్ట్ వార్త):** మండల పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా ఎన్నికైన అబ్బిడి రాజిరెడ్డిని యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్నగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, నాయకులు మరుపట్ల సాయికుమార్, ఎర్ర శ్రీకాంత్, సర్పంచ్‌లు దుబ్బ అంజయ్య, బత్తిని దశరథం, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ ఫిరాయింపులకు సుప్రీం చెంపపెట్టు!



**బయ్యారం/ సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ వార్త):** దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రజాస్వామ్యానికి మైలురాయని బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫైనాన్స్ సెల్ కన్వీనర్ తుమ్మల శ్రీనివాసరావు అన్నారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం స్ఫూర్తిని ఈ తీర్పు బలపరిచిందని పేర్కొన్నారు.ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలోకి మారడం ప్రజాతీర్పును అవమానించడమేనని అన్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనలను ప్రజాప్రతినిధులు గౌరవించాలని సూచించారు. సుప్రీంకోర్టు తీర్పుతో పార్టీ ఫిరాయింపులకు అడ్డుకట్ట పడేలా స్పష్టమైన సందేశం వెళ్లిందని తుమ్మల శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## చెరువు తూములు తెరవాలి



**బయ్యారం/సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ వార్త):** బయ్యారం పెద్ద చెరువు తూములను వెంటనే తెరిచి దిగువన ఉన్న లింకు చెరువులను నింపాలని సర్పంచ్‌లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌ను కోరారు. పెద్ద చెరువు నీటిపై ఆధారపడి సుమారు 7 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్న రైతులకు సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చెరువు నిండి అలుగు ద్వారా నీరు వృథాగా మున్నేరులో కలుస్తోందని పేర్కొన్నారు. తూములు తెరిచి నీటిని లింకు చెరువులకు మళ్లించేలా ఇరిగేషన్ అధికారులను ఆదేశించాలని బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్, జగ్గుతండా సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ కలెక్టర్‌ను కోరారు.

# వినాయక నిమజ్జనంలో పాల్గొన్న కోయగూడెం సర్పంచ్ లింగ నాయక్.



**బయ్యారం/సెప్టెంబర్ 25.(జర్నలిస్ట్ వార్త);**బయ్యారం మండలం కోయగూడెం పంచాయతీలో వినాయక నిమజ్జనోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమంలో కోయగూడెం సర్పంచ్ లింగ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గ్రామస్తులతో కలిసి నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవడం అభినందనీయమని అన్నారు.గణపతి ఆశీస్సులతో గ్రామంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం,ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాదులో ఫోటో ఎగ్జిబిషన్..

**పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాగమయి**



**సత్తుపల్లి/సెప్టెంబర్ 25 (జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాదులో అక్టోబర్ 2, 3, 4 తేదీల్లో నిర్వహించనున్న ఫోటో ఎగ్జిబిషన్ పోస్టర్‌ను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శుక్రవారం సత్తుపల్లిలో ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి కనకారావు, మండల అధ్యక్షుడు, సోనీ స్టూడియో అధినేత పాషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, హైదరాబాద్ ఫోటో టెక్ అధినేత అభిమన్యు రెడ్డి, కెనాన్ కెమెరా మెంటర్ భూపాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాగమయి చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫోటోగ్రఫీ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఫోటోగ్రాఫర్లు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఎగ్జిబిషన్‌లో నూతన కెమెరాలతో పాటు కెమెరాలు, ఫోటోగ్రఫీకి సంబంధించిన వివిధ కంపెనీల ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సుమారు 100 కంపెనీలు పాల్గొనే ఈ ఎగ్జిబిషన్‌ను ఫోటోగ్రాఫర్లు సందర్శించి ఆధునిక పరికరాలు, సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని కోరారు.
కార్యక్రమంలో సత్తుపల్లి ఫోటోగ్రాఫర్స్ జిల్లా జాయింట్ సెక్రటరీ సుమాంజలి రాము, మండల సెక్రటరీ రాంబాబు, కోశాధికారి మూర్తి, ఫోటోగ్రఫీ సభ్యులు గాంధీ, అన్వర్ పాషా, బాబీ, పరిమి వెంకటేశ్వరరావు, హరీష్, కోటేశ్వరరావు, కల్కి వెంకటేశ్వరరావు, మురళి, జొన్నలగడ్డ నరేష్, నవీన్, సుబ్బారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## హరీష్ నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ వద్దిరాజు



**కేసముద్రం/సెప్టెంబర్ 25 (జర్నలిస్ట్ వార్త):**
కేసముద్రం స్టేషన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు జాటోత్ హరీష్ నాయక్ తండ్రి జాటోత్ లచ్చిరాం నాయక్ (85) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం హరీష్ నాయక్ కుటుంబాన్ని పరామర్శించారు.లచ్చిరాం నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత వద్దిరాజు కిషన్, పట్టణ అధ్యక్షుడు గుగులోతు వీరునాయక్, మాజీ సర్పంచ్ కన్న యాకయ్య, రామచంద్రారెడ్డి, భూమాటి పురుషోత్తం, భూక్యా బాలు తదితరులు పాల్గొన్నారు.

## మేస్త్రి రవి మృతికి కార్మిక సంఘం నాయకుల నివాళి



**మల్లక్‌పల్లి/ సెప్టెంబర్ 25 (జర్నలిస్ట్ వార్త):**మల్లక్‌పల్లి గ్రామానికి చెందిన భవన నిర్మాణ రంగ కార్మికుడు, తాపీ మేస్త్రి భైరపాక రవి (మోని కుమారుడు) శుక్రవారం తెల్లవారుజామున 2.15 గంటలకు ఆకస్మికంగా మృతి చెందారు. గత పదేళ్లుగా తాపీ మేస్త్రిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న రవి ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో విషాదంలో మునిగిపోయారు.విషయం తెలుసుకున్న భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్ రవి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం రవి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో తాటికాయల ప్రదీప్, సిరివెన స్వామి, శంకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీ నామినేటెడ్ పదవులపై సభ్యుల అభ్యంతరాలు

## ఎన్నికల ద్వారా పదవులు భర్తీ చేయాలని సభ్యుల డిమాండ్

## 1967లో పది మంది సభ్యులతో ప్రారంభమైన సంఘం.. నేడు 6,500 మంది సభ్యులు

**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 25 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి మండలంలోని విశాల సహకార సంఘం పరిధిలో చైర్మన్, డైరెక్టర్ల నామినేటెడ్ పదవుల ఏర్పాటుపై సంఘం సభ్యుల్లో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, మెజార్టీ సాధించిన డైరెక్టర్ల ద్వారా చైర్మన్‌ను ఎన్నుకునే విధానం ఉండేదని సభ్యులు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం నామినేటెడ్ పదవుల విధానం వల్ల ఎన్నికైన సభ్యుల అభిప్రాయాలకు ప్రాధాన్యం తగ్గుతున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పది మందితో ప్రారంభమై.. 6,500 మంది సభ్యులకు
1967లో వల్భాపూర్ గ్రామానికి చెందిన పోల్సాని నర్సింగరావు ఆధ్వర్యంలో పది మంది సభ్యులతో విశాల సహకార సంఘం ప్రారంభమైనట్లు సభ్యులు తెలిపారు. కాలక్రమేణా సంఘం విస్తరించి ప్రస్తుతం సుమారు 6,500 మంది సభ్యులకు సేవలందిస్తోందన్నారు. వ్యవసాయ రుణాలతో పాటు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు, వాహన రుణాలు, వ్యవసాయ అభివృద్ధికి సంబంధించిన రుణాలు అందించిన చరిత్ర సంఘానికి ఉందని పేర్కొన్నారు.
అయితే ప్రస్తుతం సంఘం ఆర్థిక పరిస్థితిపై సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా సంఘంలో సుమారు రూ.2 కోట్ల వరకు లోటు ఏర్పడినట్లు వారు ఆరోపిస్తున్నారు. ఈ బకాయిల వసూళ్ల కోసం కింది స్థాయి చైర్మన్లు, డైరెక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత పాలకవర్గాల హయాంలో జరిగినట్లు చెబుతున్న ఆర్థిక అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని సభ్యులు కోరుతున్నారు.

**పాలకవర్గాల నిర్ణయాలపై ప్రశ్నలు**

చైర్మన్, వైస్ చైర్మన్, కార్యదర్శి స్థాయిలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం, డైరెక్టర్ల అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్లే సంఘం అభివృద్ధి మందగించిందని కొందరు సభ్యులు ఆరోపిస్తున్నారు. గతంలో సంఘం పాలకవర్గాల మధ్య విభేదాలు తీవ్రస్థాయికి వెళ్లి ఘర్షణలకు దారితీసిన సందర్భాలు కూడా ఉన్నాయని వారు గుర్తుచేశారు.
సంఘం అభివృద్ధి, ఆర్థిక పరిస్థితి, గత బకాయిలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న లావాదేవీలపై పారదర్శకంగా లెక్కలు వెల్లడించాలని సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, కార్యదర్శి తీసుకున్న నిర్ణయాలపై సభ్యులకు పూర్తి సమాచారం అందించాలని కోరుతున్నారు.

**ఎన్నికల ద్వారా పాలకవర్గం ఏర్పాటు చేయాలి**

సహకార సంఘం అనేది సభ్యుల ఆధారంగా నడిచే సంస్థ అని, వ్యక్తిగత నిర్ణయాలతో కాకుండా సభ్యుల తీర్మానాలు, సంఘం నిబంధనల ప్రకారం పాలన సాగాలని సభ్యులు స్పష్టం చేస్తున్నారు. ఎన్నికైన డైరెక్టర్ల అభిప్రాయాలకు ప్రాధాన్యం కల్పించి, నిబంధనల ప్రకారం చైర్మన్ పదవిని భర్తీ చేయాలని వారు కోరుతున్నారు.
చైర్మన్, డైరెక్టర్ పదవుల విషయంలో గతంలో జరిగిన న్యాయపరమైన పరిణామాలు, కోర్టు తీర్పులపై సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయని తెలిపారు. న్యాయస్థానాల తీర్పులను గౌరవిస్తూనే సంఘం భవిష్యత్తు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పారదర్శక విధానాన్ని అవలంబించాలని సభ్యులు కోరుతున్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**హసన్‌పర్తి/సెప్టెంబర్ 25 (జర్నలిస్ట్ వార్త):**
పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని 2వ డివిజన్ గుండ్లసింగారంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన నూతన గృహాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. గుండ్లసింగారానికి చెందిన మాదాసి దయాకర్‌సుజాత దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తికావడంతో ఎమ్మెల్యే స్వయంగా వారి ఇంటికి వెళ్లి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన గృహాన్ని ప్రారంభించి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటిలో వారు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నియోజకవర్గంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రయోజనం చేకూరేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. తమకు సొంత ఇంటి కలను నెరవేర్చిన ప్రభుత్వానికి, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు దయాకర్‌సుజాత దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 2వ డివిజన్ అధ్యక్షుడు పుట్ట తిరుపతి, వర్ధన్నపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ గడిపి జీవన్, వంగపహడ్ మాజీ పాక్స్ చైర్మన్ అనిల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ బోడ డిన్న, డివిజన్ ప్రధాన కార్యదర్శి వంశీ, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# డాక్టర్ జ్యోతిర్మయికి ఆర్యవైశ్య సంఘం ఘన సన్మానం

## ఆల్ ఇండియా మెడికల్ పీజీ ప్రవేశ పరీక్షలో 7346వ ర్యాంక్ సాధించినందుకు అభినందనలు

**మహబూబాబాద్/సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ వార్త):**
మహబూబాబాద్ పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ జ్యోతిర్మయిని ఘనంగా సన్మానించారు. ఆల్ ఇండియా మెడికల్ పీజీ ప్రవేశ పరీక్షలో 7346వ ర్యాంక్ సాధించినందుకు ఆమెను ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు అభినందించారు. ఈగ శ్రీనురమ్య దంపతుల ముగ్గురు సంతానంలో పెద్ద కుమార్తె అయిన డాక్టర్ జ్యోతిర్మయి మెడికల్ పీజీ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంక్ సాధించడం పట్ల ఆర్యవైశ్య సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆమెకు పూలమాలలు, దుశ్శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ తాను సాధించిన ర్యాంకు వెనుక తన తల్లిదండ్రుల కృషి, ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. తల్లిదండ్రుల కలలను నెరవేర్చే అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. తన కృషిని గుర్తించి ఘనంగా సన్మానించిన మహబూబాబాద్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులకు, ఆర్యవైశ్యులందరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.
కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు గిరిధర్ గుప్తా, 19వ వార్డు కౌన్సిలర్ చిదిరాల అరుణ, జ్ఞానేశ్వర్ గుప్తా, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి నాళ్ల నరసింహారావు, వేమిశెట్టి కిషోర్, ఇమ్మడి కృష్ణమూర్తి, నాళ్ల వీరన్న, వేణుగోపాల్, శ్రీరంగం ఉపేందర్, మాలె శ్రావణ్, ఇమ్మడి రవి, జంగాల సదాశివుడు, మాశెట్టి రవికుమార్, లక్ష్మీకాంతారావు, ఈగ రమేష్, కోదుమూరు వీరభద్రం, కొత్త సోమన్న, సోమ శ్రీనివాస్, గెల్లి మురళి, ఇందిరా, నాళ్ల మహేశ్వరి, జంగాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు



# భగత్‌సింగ్ స్ఫూర్తితో యువతరం ముందుకు సాగాలి

## సెప్టెంబర్ 27 నుంచి 30 వరకు జయంతి ఉత్సవాలు -సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి

**హనుమకొండ/సెప్టెంబర్ 25 (జర్నలిస్ట్ వార్త):** భగత్‌సింగ్ స్ఫూర్తితో నేటి యువతరం ముందుకు సాగాలని, సెప్టెంబర్ 27 నుంచి 30 వరకు నిర్వహించనున్న భగత్‌సింగ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏఐవైఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్ అధ్యక్షతన ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కర్రె బిక్షపతి, అతిథులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఎన్.ఎ. స్టాలిన్ హాజరై మాట్లాడారు.
ఈ సందర్భంగా కర్రె బిక్షపతి మాట్లాడుతూ భగత్‌సింగ్ 1907 సెప్టెంబర్ 28న జన్మించారని, చిన్న వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమం వైపు ఆకర్షితులై దేశ విముక్తి కోసం పోరాడారని తెలిపారు. కేవలం 23 ఏళ్ల వయసులోనే ఉరికంబాన్ని ముద్దాడిన భగత్‌సింగ్ ధైర్యం, దేశభక్తి, త్యాగానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు.
భగత్‌సింగ్ తన జీవితకాలంలో చేసిన రచనలు, జైలు లేఖలు, రాజకీయ ఆలోచనలు యువతను సామాజిక మార్పు వైపు ఆలోచింపజేశాయని అన్నారు. భగత్‌సింగ్ పేరును కేవలం నినాదాలకే పరిమితం చేయకుండా ఆయన జీవితాన్ని, రచనలను, ఆలోచనలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నేటి యువత ఆయన స్ఫూర్తితో సమాజ మార్పు కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చరిత్రను వక్రీకరిస్తోందని, విద్యా రంగంలో కాషాయీకరణకు పాల్పడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను విస్మరిస్తోందని ఆయన విమర్శించారు. మత ఛాందసవాదం, సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా భగత్‌సింగ్ చూపిన పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.
సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి మాట్లాడుతూ భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చడంతో పాటు ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఎన్.ఎ. స్టాలిన్, జిల్లా ఆఫీస్ బేరర్స్ తాటికంటి మమత, గుగులోత్ సురేష్, పల్లకొండ శ్రీకాంత్, పెనుకుల మధు తదితరులు పాల్గొన్నారు.




# పుట్ట రవి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్

**హసన్‌పర్తి/సెప్టెంబర్ 25 (జర్నలిస్ట్ వార్త):**
హసన్‌పర్తి మండల పరిధిలోని 65వ డివిజన్ సుబ్బయ్యపల్లి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు పుట్ట రవి తల్లి రాజమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ శుక్రవారం రాజమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, రాజమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్‌తో పాటు నాయకులు పుట్ట శంకర్, జక్కుల శీను, సిరంగి సునీల్, నదునూరి నాగరాజు, కొత్తపేట రాజు తదితరులు ఉన్నారు.

# రాజమ్మ పార్థివ దేహానికి ఎంఆర్‌పీఎస్ నాయకుల నివాళులు

## ఫోన్‌లో పరామర్శించిన మందకృష్ణ మాదిగ



**స్టేషన్ ఘన్‌పూర్/సెప్టెంబర్ 25 (జర్నలిస్ట్ వార్త):**
మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన ఎంఆర్‌పీఎస్ జనగామ జిల్లా నాయకుడు, చిల్పూర్ మండల ఇన్‌చార్జి చాడ ఏలియా తల్లి చాడ రాజమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ జనగామ జిల్లా నాయకులు తాటికొండకు చేరుకుని రాజమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజమ్మ మృతి విషయాన్ని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ దృష్టికి తీసుకెళ్లగా, శుక్రవారం చాడ ఏలియాతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జనగామ జిల్లా ఇన్‌చార్జి బోడ సునీల్ మాదిగ, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు రాగల్ల ఉపేందర్ మాదిగ, ఇనుముల నర్సయ్య మాదిగ, కందికట్ల విజయ్ మాదిగ, పైసా రాజశేఖర్ మాదిగ, గద్దల కిషోర్, సందేన రవీందర్, బోట్ల మహేష్, నలిమేల నాగరాజు, మంద శ్రీనివాస్, మచ్చ అబ్బయ్య, ఆరూరి శ్రీనివాస్, గాదె శ్రీధర్, గోవిందు ఇసాక్, గుర్రం నవీన్, గాదె రామచందర్, బక్క మారయ్య, గుర్రం అశోక్, సంపత్, ఇసురం శ్రీనివాస్, వసంత్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# అంత్యోదయ స్ఫూర్తితోనే దేశాభివృద్ధి

## దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను కొనసాగించాలి



**కేసముద్రం/సెప్టెంబర్ 25 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మండల కేంద్రంలో భారతీయ జనసంఘ్ సిద్ధాంతకర్త, ఏకాత్మ మానవతావాద ప్రతిపాదకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ కేసముద్రం మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉప్పునూతల రమేష్ మాట్లాడుతూ సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలాలు అందాలనే అంత్యోదయ స్ఫూర్తితో దేశానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని అన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాల స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి పలు కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చూపిన మార్గంలో నడుస్తూ పార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లెంకలపల్లి శ్రీనివాస్, బానోత్ యాకూబ్, బానోత్ రమేష్, బానోత్ సురేందర్‌తో పాటు మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. :::

# సత్యనారాయణ రావు కుటుంబానికి సత్యవతి రాథోడ్ పరామర్శ

## వెంకటగిరిలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు



**కేసముద్రం/సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ వార్త):**
మహబూబాబాద్ జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు, కేసముద్రం మండలం వెంకటగిరి గ్రామ మాజీ సర్పంచ్ మాదారపు సత్యనారాయణ రావు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ సత్యవతి రాథోడ్ శుక్రవారం పరామర్శించారు. వెంకటగిరిలోని సత్యనారాయణ రావు నివాసానికి చేరుకున్న సత్యవతి రాథోడ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి పార్టీ పరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, కేసముద్రం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణ రావు, నాయకులు మర్రి రంగారావు, మోహన్ రెడ్డి, నజీర్ అహ్మద్, రావుల శ్రీనాథ్ రెడ్డి, గుగులోతు వీరు నాయక్, కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి, బానోతు వెంకన్న, భీమ నాయక్, సుమన్, గణేష్‌తో పాటు మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ వార్త
శనివారం 26 సెప్టెంబర్ 2026

# భక్తిశ్రద్ధలతో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు

## ప్రజలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రత్యేక పూజలు



**తల్లాడ/సెప్టెంబర్ 25 (జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ పట్టణంలోని శ్రీ వాసవి కన్వెన్షన్ హాల్‌లో ఆర్యవైశ్య మండల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆర్యవైశ్య మండల సంఘం అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నంబూరి మోహన్ రావు శ్రీ వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ విఘ్నాలు తొలగి, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధి కలగాలని శ్రీ వినాయకుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నంబూరి నారాయణరావు, వేమిశెట్టి వెంకటేశ్వరరావు, నంబూరి కనకయ్య, వేమిశెట్టి నాగన్న, నంబూరి నాగేశ్వరరావు, జవాజి పెద్ద నగేష్, అనుమోలు సర్వేశ్వరరావు, శ్రీను, బండారి నరసరావు, బండారి మురళి, సంతోష్, కాశి, లగడపాటి నెహ్రూ, వేమిశెట్టి శంకర్, కనకయ్య, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మండల సహాయ కార్యదర్శిగా బొల్లం సాంబరాజు

## పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తా



**ధర్మసాగర్/సెప్టెంబర్ 25 (జర్నలిస్ట్ వార్త):**
ధర్మసాగర్ మండల కేంద్రంలో నిర్వహించిన మండల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ పరిచయ కార్యక్రమంలో బొల్లం సాంబరాజును మండల సహాయ కార్యదర్శిగా నియమించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా బొల్లం సాంబరాజు మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీకి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. తనకు మండల సహాయ కార్యదర్శిగా అవకాశం కల్పించిన మండల అధ్యక్షులు పెసర రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రపు ప్రసాద్‌తో పాటు మండల, గ్రామస్థాయి కాంగ్రెస్ నాయకులకు బొల్లం సాంబరాజు కృతజ్ఞతలు తెలిపారు.

# వక్కల వెంకటస్వామికి టిఎంజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు



**హనుమకొండ/సెప్టెంబర్ 25 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండకు చెందిన సీనియర్ పాత్రికేయుడు, అంబేద్కర్ ఫెలోషిప్, దళిత రత్న అవార్డు గ్రహీత, వివేక సమయం దినపత్రిక సంపాదకుడు వక్కల వెంకటస్వామిని తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరమ్ (టిఎంజెఎఫ్) రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు ఫోరమ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ తెలిపారు. ఈ సందర్భంగా వక్కల వెంకటస్వామి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన టిఎంజెఎఫ్ రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు అణగారిన వర్గాల గొంతుకను సమాజం దృష్టికి తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. పాత్రికేయుల హక్కుల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతతో ముందుకు సాగుతానని తెలిపారు. తనకు ఈ బాధ్యత దక్కడానికి సహకరించిన టిఎంజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లెపాక రాజేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఫోరమ్ బలోపేతానికి కృషి చేస్తానని వెంకటస్వామి పేర్కొన్నారు.

# రేవంత్ రెడ్డికి ‘బెస్ట్ పబ్లిక్ సర్వెంట్‘ అవార్డు



తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. కేరళకు చెందిన ప్రతిష్ఠాత్మక ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ అందజేస్తున్న ‘ఆర్యదాన్ ముహమ్మద్ 2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్’ అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. తెలంగాణలో ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధతతో పాటు రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం ఆయన అమలు చేస్తున్న వినూత్న పథకాలు, దూరదృష్టి గల నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ ప్రకటించారు.
ఈ అవార్డు ప్రదానోత్సవం కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జరగనుంది. దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్యదాన్ ముహమ్మద్ 4వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అవార్డును స్వీకరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కేరళ చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్ స్మారకోపన్యాసం చేయనున్నారు. రూ. లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను రేవంత్ రెడ్డికి అందజేయనున్నారు.
ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ మంత్రి ఏ.పి. అనిల్ కుమార్, ప్రముఖ మేధావి కల్‌పెట్ట నారాయణన్‌లతో కూడిన జ్యూరీ రేవంత్ రెడ్డిని ఈ అవార్డుకు ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. కేరళ రాజకీయాల్లో ఆర్యదాన్ ముహమ్మద్ సీనియర్ నేతగా, 8 సార్లు ఎమ్మెల్యేగా, నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు. కార్మికులు, ప్రజా సంక్షేమం, లౌకికవాద విలువలకు ఆయన ప్రతీకగా నిలిచారు.

# వర్షాల బీభత్సంలో నిరుపేద కుటుంబానికి అండగా అరుణ్ మాదిగ

**కూలిన ఇంటి పైకప్పు..**
**బాధిత కుటుంబానికి రూ.1,000 ఆర్థిక సాయం**
**ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి**



**కేసముద్రం/సెప్టెంబర్ 25 (జర్నలిస్ట్ వార్త):**
గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ 1వ వార్డులో దళిత నిరుపేద వితంతు మహిళ చారి వెంకటమ్మ కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. వర్షాల కారణంగా వెంకటమ్మ ఇంటి పైకప్పు ఒక్కసారిగా కూలిపోవడంతో ఇంట్లోని ఫర్నిచర్, బియ్యం, దుస్తులు, ఇతర నిత్యావసర వస్తువులు ధ్వంసమయ్యాయి. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే కుటుంబం ఒక్కసారిగా నిరాశ్రయ పరిస్థితికి చేరుకుంది. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు కంటిపూడి అరుణ్ కుమార్ మాదిగ శుక్రవారం బాధితురాలి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటనపై వివరాలు తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబానికి జరిగిన నష్టాన్ని వివరించారు. ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించడంతో పాటు బాధితురాలికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.
బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా రూ. 1,000 తక్షణ ఆర్థిక సహాయం అందించిన అరుణ్ మాదిగ, ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి అండగా నిలిచారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఓటరు సవరణ, భూ రీ-సర్వే పక్కాగా జరగాలి

## ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.. నిర్లక్ష్యంపై కఠిన చర్యలు

**మహబూబాబాద్/సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ వార్త):**
ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం, గూడూరు మండలం మట్టేవాడ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. గ్రామాల్లో కొనసాగుతున్న ఓటర్ల సవరణ, భూ రీ-సర్వే, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును పరిశీలించారు.

**ఎన్నికల నిబంధనల మేరకే ఓటరు సవరణ**

చిన్నముప్పారంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, ఓటర్ల మ్యాపింగ్, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు-చేర్పులు, భూ రీ-సర్వే, హియరింగ్స్ పురోగతిని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. నోటీసులు అందుకున్న వారికి నిబంధనల ప్రకారం హియరింగ్స్ నిర్వహించాలని, స్పందించని ఓటర్లకు అవగాహన కల్పించి మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.
జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో ప్రభుత్వ, పట్టా, ఆబాదీ భూముల రీ-సర్వే పక్కాగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా రికార్డులను పరిశీలించి ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.



ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

అనంతరం మట్టేవాడలోని గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, డైట్ మెనూ, యూనిఫారాలు, పాఠ్యపుస్తకాల పంపిణీని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా యూనిఫారాలను అందజేశారు.

**వసతుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు**

విద్యార్థులకు నిబంధనల ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు, భోజనం



తయారు చేసే వంట సిబ్బందికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఇంగ్లిష్‌తో పాటు ఇతర సబ్జెక్టులను సులభంగా అర్థమయ్యేలా డిజిటల్ తరగతులు నిర్వహించాలని తెలిపారు.
ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును వందశాతం కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆహారం, విద్య, వసతుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్నేహ శబరీష్ హెచ్చరించారు.
ఈ పర్యటనలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీరామ్ నాయక్, ఇనుగుర్తి, గూడూరు మండలాల తహసిల్దార్లు శ్రీనివాస్, నాగభవాని తదితర అధికారులు పాల్గొన్నారు.

# రెండు రోజుల వర్షానికి పలు గ్రామాల్లో ఇళ్లలోకి వరద నీరు

## తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించిన సర్పంచులు -పారిశుధ్య చర్యలు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి

**సత్తుపల్లి/సెప్టెంబర్ 25 (జర్నలిస్ట్ వార్త):**
గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో సత్తుపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వరద నీరు చేరింది. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గ్రామాల్లో నీటి ప్రవాహం ఉధృతం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
మండలంలోని లింగపాలెం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ మొత్తం వరద నీటితో నిండిపోయింది. పాఠశాల ఆవరణ చెరువును తలపించేలా మారింది. నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కావాల్సి వచ్చింది. పరిస్థితిని గమనించిన సర్పంచ్ యర్రా రమేష్ వెంటనే స్పందించి జేసీబీని ఏర్పాటు చేసి పాఠశాల ఆవరణలో నిలిచిన వరద నీటిని బయటకు పంపించేందుకు చర్యలు చేపట్టారు.



అదేవిధంగా భీమవరం గ్రామంలో మూడు ఇళ్లలోకి వరద నీరు చేరడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇళ్లలోకి నీరు చేరడంతో వంట చేసుకునే పరిస్థితి లేక గురువారం రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చిందని బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ వంట్ల రమేష్ వెంటనే జేసీబీని ఏర్పాటు చేసి సైడ్ కాలువ తవ్వించారు. దీంతో ఇళ్లలోకి చేరిన వరద నీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు.
రెజర్ల గ్రామంలోనూ పలు ప్రాంతాల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో మరిన్ని సహాయక చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.
వర్షాల కారణంగా గ్రామాల్లో సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టిన సర్పంచుల తీరుపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో సత్తుపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# కుల వివక్షత ఇంకెన్నాళ్లు?

## సిద్దిపేటలో వినాయక అన్నదానంలో కులవివక్ష ఆరోపణలు -బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి తెలంగాణ అంబేద్కర్ సంఘం

**భీమదేవరపల్లి/సెప్టెంబర్ 25 (జర్నలిస్ట్ వార్త):**
సిద్దిపేట పట్టణంలోని ఇమాంబాద్‌లో ఈ నెల 22న నిర్వహించిన వినాయక అన్నదాన కార్యక్రమంలో దళితుల పట్ల కులవివక్షకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలను తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ డిమాండ్ చేశారు.
ఆధునిక సమాజంలో కులం పేరుతో మనుషులను వేరు చేయడం, అన్నదాన కార్యక్రమాల్లో సైతం వివక్ష చూపడం బాధాకరమని ఆయన అన్నారు. దేవుడి పేరుతో నిర్వహించే కార్యక్రమంలో కులాల ఆధారంగా ప్రజలను వేరు చేయడం సమాజానికి తప్పుడు సందేశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు.
ఇమాంబాద్‌లోని వినాయక మండపం వద్ద జరిగిన అన్నదానంలో ఎస్సీలకు ఒకవైపు, బీసీ, ఓసీలకు మరోవైపు వేర్వేరుగా భోజనాలు వడ్డించినట్లు ఆరోపణలు వెలువడ్డాయని తెలిపారు. ఈ ఘటనను ఓ యువకుడు ప్రశ్నిస్తూ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో




ప్రచురించడంతో విషయం వెలుగులోకి వచ్చిందన్నారు.
యువకుడికి రక్షణ కల్పించాలి
కులవివక్షను ప్రశ్నిస్తూ ఘటనను వీడియో తీసి వెలుగులోకి తీసుకువచ్చిన యువకుడికి ఎలాంటి బెదిరింపులు, వేధింపులు జరగకుండా ప్రభుత్వం రక్షణ కల్పించాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం డిమాండ్ చేసింది.

**సోషల్ మీడియా దుర్వినియోగంపై చర్యలు**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, దళిత సమాజం పట్ల అవమానకరమైన లేదా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాను దుర్వినియోగం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది.
గ్రామాలు, పట్టణాలు, దేవాలయాలు, పాఠశాలలు, అన్నదాన కార్యక్రమాలు సహా ఎక్కడా కులవివక్షకు తావులేకుండా ప్రభుత్వం విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంఘం సూచించింది.
ఎస్సీ, ఎస్టీ హక్కులు, రిజర్వేషన్ల పరిరక్షణతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలులో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరింది.
కులం, మతం, ప్రాంతం అనే భేదాలు లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవించడమే భారత రాజ్యాంగం చూపిన మార్గమని చెప్యాల ప్రకాష్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం నెలకొల్పేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ఇమాంబాద్ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోకపోతే తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.